క్లుప్తంగా

భారీ ఎత్తున అన్నదానం



గంగమ్మ ఆలయం సమీపంలో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 11వడివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయం సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద మేయర్ డాక్టర్ శిరీష, మేయర్ భర్త డాక్టర్ మునిశేఖర్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్కే బాబు, కార్పొరేటర్లు దూదికుమారి, ఆదిలక్ష్మి, నరేంద్ర, పార్టీ నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి సమక్షంలో కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం వెయ్యి మందికి పైగా అన్నదానం చేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

తిరుపతి(అలిపిరి): జూలై 15లోపు మరణించిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ పెన్షన్ అందించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని రెండోసారి ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎంపికైన చీర్ల కిరణ్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులకు గత ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌ఎస్ బకాయిలను జూన్ 15లోపు చెల్లించాలన్నారు. లేకుంటే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఆగస్టు 10 లోపు సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సెప్టెంబర్ 1వ తేదీన పెద్ద ఎత్తున విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. తనను రెండోసారి ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఏక్రగీవంగా ఎంపిక చేయడం సంతోషకరమని.. ఉద్యోగులకు అందుబాటులో ఉండి సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.37.05 లక్షలు



గంగమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం హుండీ లెక్కింపు ద్వారా రూ.37,05,178 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ కె.మమత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయంలో అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవదాయ శాఖ, ఈస్ట్ పోలీసులు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఆలయ అధికారి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. అమ్మవారికి జాతర సందర్భంగా నగదుతోపాటు 13.300 గ్రాముల బంగారం, 105.386 గ్రాముల వెండి హుండీ కానుల ద్వారా లభించింది.

ఘనంగా అరుల్ అరసు జన్మదినం



పాస్టర్ అరుల్ అరుసుతో క్రైస్తవ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని షెకీనా చర్చి వ్యవస్థాపకుడు, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, సీనియర్ పాస్టర్ అరుల్ అరుసు 60వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఈస్ట్ లూథరన్ చర్చి ప్రాంగణంలో జరిగిన జన్మదిన వేడుకల సందర్భంగా అరుల్ అరుసును పలువురు పాస్టర్లు, క్రైస్తవులు, స్నేహితులు ఆయనను శాలువాలు, పుష్పగుచ్ఛాలతోపాటు జ్ఞాపికలను అందజేసి, ఘనంగా సత్కరించారు.

రేపటి నుంచి ఉచిత చదరంగ శిక్షణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 5–15 ఏళ్ల లోపు బాలబాలికలకు ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచిత చదరంగ శిక్షణ ఇవ్వనున్నట్లు ది చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ నిర్వాహకులు అంజూరు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చివరి రెండు రోజుల చదరంగ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. శిక్షణకు వచ్చే వారు చదరంగ బోర్డు, కాయిన్స్, 200 పేజీల బుక్, పెన్, పెన్సిల్, రెడ్‌పెన్ తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేడుకగా కపిలవిభుని పుష్పయాగం



శ్రీకపిలేశ్వర స్వామికి వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరాలయంలో గురువారం పత్రపుష్పయాగం కనుల పండుగగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి అభిషేకం చేశారు. అనంతరం 7.30 నుంచి 9.30 గంటల వరకు శ్రీకపిలేశ్వర స్వామివారు, శ్రీకామాక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, విభూది, పసపు, చందనాలతో అభిషేకం చేశారు. అనంతరం 10 నుంచి 12 గంటల వరకు పత్రపుష్పయాగ మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరాలతోపాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్రపుష్పయాగం చేశారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి దాతలు మూడు టన్నులు పుష్పాలు, పత్రాలు విరాళంగా అందజేశారు. ఇందులో 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలు ఉన్నాయి. ఆలయంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారుల, భక్తుల కారణంగా తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, గార్డెన్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణ వర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పత్రపుష్పాభిషేకం అనంతరం స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు



పత్రపుష్పయాగంలో శ్రీకపిలేశ్వరస్వామి

ఘనంగా పున్నమి గరుడ సేవ



గరుడ వాహనంపై దర్శమిస్తున్న గోవిందుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు గురువారం రాత్రి గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. తదుపరి స్వామివారిని అభిషేక సేవను నిర్వహించి, మరకత మాణిక్యాలు, వజ్ర వైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారికి ఊంజల్ సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గోవిందుడు తనకు ప్రీతిపాత్రమైన గరుడునిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చక స్వామి బాలాజీ రంగాచార్యులు, జమేదార్ చిరంజీవి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకు కౌంటింగ్



అభ్యర్థుల ప్రతినిధులతో చంద్రగిరి ఆర్ఓ నిషాంత్‌రెడ్డి సమావేశం

తిరుపతి అర్బన్: ఎన్నికల నిబంధనల మేరకు జూన్ 4వ తేదీన కౌంటింగ్ నిర్వహిస్తామని చంద్రగిరి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ విధివిధానాలను వారికి వివరించారు. జూన్ 4వ తేదీన తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ భవనంలోని లైబ్రరీ హాల్, ధృతి చాంబర్‌లో కౌంటింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ మొదలు అవుతుందని వివరించారు. పోటీలోని అభ్యర్థులతోపాటు ఏజెంట్లు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించడానికి అంతా సహకరించాలని కోరారు.



మండుతున్న ఎండల దాటికి ప్రజలు అల్లాడుతుంటే ఇక నోరులేని మూగజీవాల పరిస్థితి ఎలా ఉంటుందో ఈ చిత్రాన్ని చూస్తే తెలుస్తుంది. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై కోళ్ల తరలించే లారీలు తరచూ కనిపిస్తుంటాయి. గురువారం మధ్యాహ్నం భానుని ప్రతాపం తీవ్రంగా ఉంది. అదే సమయంలో ఓ లారీలో కోళ్లను తీసుకు వెళుతూ మార్గమధ్యలోని పొలాల వద్ద ఆగారు. లారీలోని కోళ్లపై పొలాల వద్దనున్న నీటిని చల్లదనం కోసం చల్లుతూ కనిపించారు. కోళ్లు చనిపోకుండా చేస్తున్న ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తు నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ భద్రతా సిబ్బందికి ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ముందుగా సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేసిన తర్వాత పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బందికి పలు అంశాలపై సూచనలు చేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో మురళి అంత్యక్రియలు

పాకాల: అనుమానాస్పద స్థితిలో బుధవారం మరణించిన మురళీ (27) అంత్యక్రియలు తలారిపల్లిలో గురువారం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మురళీ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద ఎత్తున చేరుకుని మురళీకి కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రేమ వ్యవహారంలో పలు అనుమానాల మధ్య మురళీది ఆత్మహత్య లేక హత్య అన్న విషయం తేలాల్సి ఉంది. మురళీ ప్రేమించిన అమ్మాయి తరపు కుటుంబ సభ్యులే హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఇదివరకే ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీఐ రాజగోపాల్ స్పందిస్తూ అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మామిడి కాయల మండీ ప్రారంభం

చంద్రగిరి: జాతీయ రహదారి వద్ద కాటా వద్ద మామిడి కాయల మండీని గురువారం ప్రారంభించారు. చంద్రగిరిలో గత పది సంవత్సరాలకు పైగా మామిడికాయల మండీ నిర్వహిస్తున్నారు. ఇతర మండీల మాదిరిగా కాకుండా సూట్, కమిషన్ ఇలాంటి లేకుండా రైతులకు మామిడి కాయలు లోడ్డు తీసుకురాగానే అప్పటికప్పుడు ఆ రోజు ధర ప్రకారం నగదు చెల్లిస్తున్నామని యజమాని పులిపాటి హేమాద్రి తెలిపారు. అదేవిధంగా మామిడి రైతులు సంవత్సర కాలం పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తూ, రైతుల ఆదరాభిమానాలు పొందుతున్నామని పేర్కొన్నారు. ఈ వత్సరం కూడా చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, వెదురుకుప్పం, తిరుపతి రూరల్, చిన్నగొట్టిగల్లు మండలాల్లో మామిడి రైతులకు అందుబాటులో ఉన్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 98660 05670, 79830 56790 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం



స్మార్ట్ సిటీ పనులపై సమీక్షిస్తున్న అదితి సింగ్

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం స్మార్ట్ సిటీ అధికారులతో ఆమె సమీక్షించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణ పనులు మరింత వేగంగా పూర్తి చేయాలని ఆమె అధికారులతో అన్నారు. ఇంటిగ్రేటెడ్ సిటీ ఆపరేషన్ బిల్డింగ్ నిర్మాణ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయించే బాధ్యత ఇంజనీర్లదేనని చెప్పారు. మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులు, ఇతర పనుల స్థితి గతులపై చర్చించి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొలుత పాత మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో నిర్మితమవుతున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈఈ విజయకుమార్ రెడ్డి, ఏయికాం సంస్థ ప్రతినిధి బాలాజీ, ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి, మేనేజర్ చిట్టిబాబు, స్మార్ట్ సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సీరామాపురంలో ఫ్లాగ్ మార్చ్ చేపడుతున్న తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రామచంద్రాపురం: శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. గురువారం మండలంలోని సీరామాపురంలో ట్రైనింగ్ ఎస్పీ దేవరాజు, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, శరత్‌రాజ్ కుమార్‌లతో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమస్యాత్మక గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్ఐ చిరంజీవిని ఆదేశించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవిలు ఆర్సీపురం ఎస్టీ కాలనీ నుంచి కమ్మకండ్రిగ వరకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శేఖర్, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ మదన్‌మోహన్, పోలీసు సిబ్బంది సురేష్, యోబు, త్యాగరాజులు, ధనుంజయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు సమగ్ర విద్య



ప్రత్యేక ప్రతిభావంతుడి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: ప్రత్యేక అవసరాలున్న బడిఈడు పిల్లలకు ప్రభుత భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్య అందిస్తున్నామని జిల్లా ఐఈ(ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్) కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని తొండవాడ, చంద్రగిరి పాతపేట, కొత్తపేట, బ్రాహ్మణ వీధుల్లో ప్రత్యేక అవసరాలున్న పిల్లల ఇళ్లకు వెళ్లి ఐఈఆర్‌టీలు చేస్తున్న సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేరుస్తామన్నారు. వీరికి ఉచితంగా ఉపకరణాలు వివిధ అలవెన్సులు సమగ్ర శిక్షణ ద్వారా అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించడంతోపాటు సమాజంలో వారు కూడా ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా తగిన నిధులను విడుదల చేసి ప్రోత్సహిస్తోందని తెలిపారు. అనంతరం సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతుల కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు వెంకట రాజేశ్వరి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంబాదూరులో జూనియర్ కళాశాల ఏర్పాటు



క్యాంపెయినింగ్ చేస్తున్న హెచ్ఎం సుజన కుమారి, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం సుజన కుమారి తెలిపారు. గురువారం కుప్పంబాదూరు, రాయలచెరువు, పీవీపురం గ్రామాలలో కళాశాలలో చేరాలంటూ క్యాంపెయినింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు మాత్రమే ఉన్నాయని, ఈ సదవకాశాన్ని విద్యార్థినీవిద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తామన్నారు. జూన్ 1వ తేదీ నుంచి కళాశాల ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ గోపీనాథ్, ఉపాధ్యాయులు రజనీ, సునీత, రామ్మూర్తి, వాసు, ఉమాశంకర్, శైలేంద్ర పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నను దర్శించుకున్న శ్రీశారదా పీఠాధిపతి



ఆలయ వెలుపలకు వస్తున్న విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారిని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామి గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, స్వామివారి నేత్ర దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఏఈఓ గోపినాథ్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృగరాజుపై కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం జగతికి వెలుగునిచ్చే దినకరుని అవతారంలో సింహవాహనాన్ని అధిరోహించిన కల్యాణ వేంకటేశ్వరుడు రాత్రి ఆబాల భూపాలాన్ని సంరక్షించే కృష్ణావతరంలో ముత్యపుపందరి వాహనంలో ఉభయనాంచారులతో గ్రామోత్సవాలలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలతో పాటు నిర్మిత హోమశాలలో ప్రత్యేక హోమాలను పూర్తి చేశారు. తొలిగంటతో నైవేద్య సమర్పణ చేశారు. 7.30 గంటలకు సుగంధ పుష్పమాలికలు, స్వర్ణాభరణాలను అలంకరించుకుని స్వామివారు వెలుగును నింపే యోగముద్రలో సూర్యదేవునిగా సింహవాహనంపై ఊరేగారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువతి మృతి

తిరుపతి రూరల్: ఆత్మహత్యకు పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ హరిపురం కాలనీలో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.... సూళ్లూరుపేట మండలం వట్రపాలెంకు చెందిన మధుసూదనరావు కుమార్తె రోస్లిన్(23) రంగంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఫార్మా–డీ పీజీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. హరిపురం కాలనీలో అహ్మద్ అనే వ్యక్తితో కలిసి ఉంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఆర్థిక విషయాల్లో రోస్లిన్‌తో అహ్మద్ వాగ్వాదం చేశాడు. దీంతో కోపంతో బెడ్‌రూంలోకి వెళ్లిన రోస్లిన్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారితో కలిసి తలుపులు పగలకొట్టిన అహ్మద్ కొన ఊపిరితో ఉన్న రోస్లిన్‌ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం రోస్లిన్ మృతి చెందింది. మృతురాలి తండ్రి మధుసూదనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర బాబు తెలిపారు.